క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

మహబూబాబాద్ : ఫ్లిప్‌కార్ట్ సంస్థ ద్వారా మానుకోట జిల్లాలో డెలివరీ బాయ్స్‌గా పని చేయుటకు నేడు (శుక్రవారం) కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఆర్‌డీఎస్‌వి రామకృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. డెలివరీ బాయ్స్‌గా 20 పోస్టులు ఖాళీలు ఉన్నాయని పదో తరగతి ఆపై చదివి, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు అర్హులన్నారు. బైక్‌తో పాటు స్మార్ట్ ఫోన్ తప్పని సరిగా ఉండాలన్నారు. జాబ్‌మేళాకు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో భోగ్ బండారో



కురవి : మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండా గ్రామపంచాయతీలో బుడియా బాపు మహాపూజ భోగ్ బండారో కార్యక్రమాన్ని గురువారం బానోత్ సీతారాం సాధు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆంజనేయ స్వామి, సేవాలాల్ మహారాజ్, మేరమా యాడిల ఆశీస్సులు ప్రజలకు ఎల్లప్పుడు ఉండాలని సీతారాం సాధు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంగోత్ రాజు సాధు, బిచ్చ సాధు, వస్యా సాధు, బాలోజీ సాధు, చిన్న, మోహన్, దేవేందర్, తండావాసులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు




మరిపెడ రూరల్ : మరిపెడ మండలం అబ్బాయిపాలెం పరిధిలోని అగస్తేశ్వర గుట్ట సమీపంలో విద్యుత్ స్తంభం ఒరిగి తీగలు కిందికి వేలాడుతున్నాయి. దీంతో ఒరిగిన స్తంభానికి సరి చేయాలని బాధిత రైతులు బుధవారం స్తంభం వద్ద ఆందోళన చేపట్టారు. దీనిపై 'ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం' అనే కథనం సాక్షిలో గురువారం ప్రచురితమైంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఒకవైపు ఒరిగిన స్తంభాన్ని సరిచేశారు. తక్షణమై స్పందించి సమస్యను పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఆరుగురిపై కేసు నమోదు

డోర్నకల్ : బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు బాధిత కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సదరు బాలిక బుధవారం పాఠశాలకు వెళ్లి వస్తుండగా డోర్నకల్‌కు చెందిన రెంటాల రాహుల్ అడ్డగించి అసభ్యంగా ప్రవర్తించాడు.దీంతో బాలిక ఇంటికి వచ్చి జరిగిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పింది. కాగా సాయంత్రం బాలిక ఇంటి వద్ద గొడవ జరగగా బాలికతో పాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు రాహుల్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు ధనుష్, ప్రమీల, నందు, ఆనందరావు, కవితపై కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో స్థల వివాదంలో సంబంధించి సత్తి ఎలమంద అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన తుల్లూరి అప్పమ్మ దాడి చేయడంతో తలకు గాయమైందన్నారు. క్షతగాత్రుడి తల్లి సత్తి యశోదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బస్తాలు మోసిన విద్యార్థులు



మహబూబాబాద్ రూరల్ : మండలంలోని మల్యాల యూపీఎస్‌లో చదువుతున్న విద్యార్థులు గురువారం పని చేస్తు కనిపించారు. 30 మంది విద్యార్థులుండగా ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. కాగా తరగతి గదులు, పరిసరాల శుభ్రం చేయించాల్సిన బాధ్యత హెచ్ఎంపై ఉండగా ఆ పనులన్నీ అలాగే ఉండిపోయాయి. అయితే గురువారం బడి తెరిచిన కొంత సమయానికి విద్యార్థులతో పాఠశాలలోని పాత ఇనుప సామగ్రి, క్యారం బోర్డులు, ఇతర వస్తువులు, పుస్తకాలు, రికార్డులు కట్టి ఉన్న సంచులను మోయించారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ హెచ్ఎం బావ్‌సింగ్‌ను వివరణ కోరగా ఆ పనులు వేరే మనిషిని పెట్టి చేయిస్తున్నామని, విద్యార్థులతో తాము ఎలాంటి పనులు చేయించలేదని పేర్కొన్నారు.

మరమ్మతు చేయాలి

డోర్నకల్ : డోర్నకల్ మున్సిపల్ పరిధిలోని కొర్లకుంట అలుగు వాగుకు మరమ్మతు చేయాలని నెహ్రూ స్ట్రీట్ వాసి ఎండీ మైనుపాషా కోరారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం కొర్లకుంట అలుగువాగుకు మరమ్మతులు చేయాలని కోరుతూ కమిషనర్ నరేష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

గుడుంబా విక్రయించొద్దు

మహబూబాబాద్ రూరల్ : జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ టౌన్, రూరల్ పరిధిలో 40లీ లీటర్ల గుడుంబాతో పాటు 1,500లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు.అలాగే ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ దేవేందర్, రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

మరిపెడ రూరల్ : ప్రభుత్వం నిషేధించిన గుడుంబాను తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని మరిపెడ సీఐ హథీరామ్ నాయక్ హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జర్పులతండా, అబ్బాయిపాలెం, భూక్య తండా గ్రామ పంచాయతీ పరిధిలోని బోడతండాలో గుడుంబా స్థావరాలపై సీఐ ఆధ్వర్యంలో గురువారం విస్తృతస్థాయిలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 50 లీటర్ల గుడుంబా, 750 లీటర్ల నల్లబెల్లం, పటిక ధ్వంసం చేశారు. అలాగే ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ హథీరామ్ నాయక్ పేర్కొన్నారు.

తొర్రూరు/తొర్రూరు రూరల్ : తొర్రూరు డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో డీఎస్పీ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు రూ.68 వేల విలువ చేసే 170 లీటర్ల గుడుంబా, రూ.7.75 లక్షల విలువ చేసే 7,750 లీటర్ల చక్కెర, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా 16 మందిపై కేసులు నమోదు చేశారు.

18 లీటర్ల గుడుంబా స్వాధీనం.. ఇద్దరిపై కేసు

దంతాలపల్లి : 18 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై కరుణాకర్ తెలిపిన వివరాలు.. మండలంలోని వాల్యతండా గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో గుగులోత్ సీతారాములు ఇంట్లో 10 లీటర్ల గుడుంబా, 400 లీటర్ల బెల్లం పానకం, భూక్యా కిషన్ ఇంట్లో 8 లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకం పట్టుబడినట్లు తెలిపారు. పానకాన్ని ధ్వంసం చేసి గుడుంబాను స్వాధీనం చేసుకొని సీతారాములు, కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.

గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు

నెల్లికుదురు : నిషేధిత గుడుంబాను తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ శివారు ఆకేరు వాగు ప్రాంతంలోని తుల్యా తండాకు చెందిన ధరావత్ రమేష్, నెల్లికుదురులో షేక్ హసీనా అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నారని బుధవారం నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. పోలీసులు వెళ్లి సోదాలు చేయగా ధరావత్ రమేష్ ఇంట్లో తయారు చేసిన 10లీటర్ల గుడుంబా, మూడు డ్రమ్ముల్లో 2వేల లీటర్ల బెల్లం పానకం, నెల్లికుదురులో షేక్ హసీనా ఇంట్లో 10లీటర్ల గుడుంబా ఉందన్నారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డోర్నకల్ : మండలంలోని తెల్లబండ తండా గ్రామంలో గురువారం గుడుంబా స్థావరాలపై డోర్నకల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ బి.ఉపేందర్‌రావు, ఎస్సై తిరుపతి ఆధ్వర్యంలో తెల్లబండతండాలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 3,000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేసముద్రంలో..

కేసముద్రం : ఇనుగుర్తి మండలం తారాసింగ్ జీపీ శివారు బావోజీతండాలో గుడుంబా స్థావరాలపై గురువారం ఎస్సై వంశీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గూడూరులో..

గూడూరు : మండలంలోని చిర్రకుంటతండా శివారు పూల్‌సింగ్‌తండాలో గురువారం ఎస్సై సీహెచ్.నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులైన ముగ్గురుపై కేసి నమోదు చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బిచ్చానాయక్, రవీందర్‌రెడ్డి, ఎర్రయ్య, లక్ష్మయ్య, రాధిక, కుమార్, ప్రేమ్, సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగూడ : మండలంలోని కొత్తపల్లి, రొతుగూడెం గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై ఎస్సై దిలీప్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి బెల్లం పానకం ధ్వంసం చేశారు. 150 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



దంతాలపల్లి : బెల్లం పానకం, తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు



మరిపెడ రూరల్: పట్టుబడిన సామగ్రి..



మహబూబాబాద్ టౌన్‌లో..



గూడూరు: చిర్రకుంటతండాలో..



నెల్లికుదురు: బ్రాహ్మణకొత్తపల్లిలో..



కేసముద్రంలో..



కొత్తగూడలో..

అధికారుల విచారణ



వాంగ్మూలం తీసుకుంటున్న ఎంపీఓ

కేసముద్రం : కేసముద్రంవిలేజ్‌లో వ్యవసాయ బావులకు వెళ్లే దారిలో సొంత ఖర్చులతో పోసుకున్న మొరం రోడ్డుపై, అక్రమంగా జీపీ నుంచి బిల్లు చేసుకుని రూ.4లక్షలకు పైగా నగదును డ్రా చేసుకున్నారని ఆరోపిస్తూ, అదే గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇటీవల ఎంపీడీఓకు, ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఎంపీఓ ప్రసాదరావు, కార్యదర్శి రేవంత్‌నాయుడుతో కలిసి రోడ్డును పరిశీలించి, విచారణ చేశారు. ఈ మేరకు ఎకరాకు రూ.500ల చొప్పున 200 ఎకరాలకు డబ్బులను వసూలు చేసి, పీతిరివాగు నుంచి ముత్యాలమ్మగుడి వరకు గుంతలమయంగా మారిన రోడ్డుపై మొరం పోసుకున్నామని, అదే రోడ్డుపై జీపీ నుంచి అక్రమంగా బిల్లు చేసి, డబ్బులను డ్రా చేశారని పలువురు రైతులు లిఖిత పూర్వకంగా రాసి ఎంపీఓకు వాంగ్మూలం ఇచ్చారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఎంపీఓ తెలిపారు. కాగా డ్రా చేసుకున్న డబ్బులను తిరిగి తమకు చెల్లిస్తే రోడ్డును బాగు చేసుకుంటామని రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పోలెపల్లి చెన్నారెడ్డి, బైరు వెంకన్న, వేముల శ్రీనివాస్, సత్తిరెడ్డి, నాగిరెడ్డి, కొమురారెడ్డి, పాదిల వెంకట్‌రెడ్డి, దురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ చేయూత

కురవి : అమ్మను కోల్పోయి అనాథగా మారిన మానస పరిస్థితిని వాట్సాప్ గ్రూపులో చూసి చలించిన ఎన్‌ఆర్‌ఐ కోల శ్రీనివాస్‌గౌడ్ చేయూతనందించారు. నర్సంపేటకు చెందిన శ్రీనివాస్‌గౌడ్ ప్రస్తుతం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డాడు. తన బాల్యమిత్రుడు కురవి గ్రామ పంచాయతీ కార్యదర్శి దివాకర్ ద్వారా రూ.20వేల ఆర్థికసాయాన్ని పంపించగా గురువారం తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, ఈఓపీఆర్‌డీ విజయలక్ష్మి, కురవి ఈఓ దివాకర్ చేతు మీదుగా బాలిక మానసకు అందజేశారు.

ఆర్‌ఎంపీలపై దాడులు మానుకోవాలి



తొర్రూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు

తొర్రూరు : ప్రాథమిక చికిత్స చేసి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్న ఆర్‌ఎంపీలపై తనిఖీల పేరిట మెడికల్ కౌన్సిల్ చేస్తున్న దాడులను మానుకోవాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకుడు అనపురం వెంకన్న, షేక్ అంకూస్ కోరారు. ఆర్‌ఎంపీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంబేడ్కర్ విగ్రహానికి అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా అధికారులు దాడులు నిర్వహిస్తూ ఆర్‌ఎంపీలను వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో దొంతు సత్యం, మాదారపు ప్రకాష్, గొడిశాల నవీన్, భీమయ్య, ధర్మారపు హన్మంతు, వెంకన్న, అంబదాసు, వెంకటేష్, క్రాంతి, రాజమౌళి పాల్గొన్నారు.

తెరుచుకున్న పాఠశాల గేటు

డోర్నకల్ : మండలంలోని పెరుమాళ్ల సంకీస ప్రాథమిక పాఠశాల గేట్లు గురువారం తెరుచుకున్నాయి. కాగా పాఠశాల భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ తమకు బిల్లులు మంజూరు కాలేదంటూ బుధవారం సాయంత్రం తాళం వేశాడు. ఇదే విషయాన్ని హెచ్ఎం కృష్ణారెడ్డి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పాఠశాలలో 90 శాతంకు పైగా పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు రూ.7.5 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల గేట్లు మూసి తాళాలు వేయగా అధికారులు కలగజేసుకుని తాళాలు తెరిపించారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

● జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

కురవి : మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గుడిసెవాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. కురవి శివారులోని తిర్మాలాపురం గ్రామ శివారులోని అసైన్డ్ భూమిని గుర్తించి పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. వారందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, పోగుల శ్రీనివాస్‌గౌడ్, కురియాల వీరన్న, సత్యనారాయణ, పద్మావతి, నాగమణి, మల్లమ్మ, రుక్మిణి, రజిత, మంగమ్మ, రాధ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

కురవి : మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారిపై అడ్డు వచ్చిన గేదెను, బైక్ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. కాగా సమాచారం మేరకు ఎస్సై గోపి సంఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని తన వాహనంలో మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నాడు. మహారాష్ట్రకు చెందిన అర్జున్ వ్యాపార నిమిత్తం టార్పాలిన్‌లతో మరిపెడ నుంచి కురవి వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో సోమ్లాతండా సమీపంలోని జాతీయ రహదారిపైకి ఒక్కసారిగా గేదెలు పరుగెత్తుకుంటూ అడ్డు రావడంతో, బైక్ అదుపు తప్పి గేదెను ఢీకొనడంతో కిందపడ్డాడు. ఇంతలో విషయం తెలుసుకున్న ఎస్సై గోపి సంఘటన స్థలానికి చేరుకున్నాడు. తన వాహనంలో ఎక్కించి మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించాడు.

రేపటినుంచి ఇంటింటి సర్వే

నెహ్రూసెంటర్ : బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియలో భాగంగా జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ప్రజలు సహకరించాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం వైద్యసిబ్బందికి బీసీజీ వ్యాక్సిన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18ఏళ్లు పైబడిన షుగర్, పొగతాగే వారు, 60 సంవత్సరాలు పైబడిన వారికి, టీబీ మందులు వాడుతున్న వారికి, టీబీ రోగులు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. పీడీఎంఓలు డాక్టర్ రమ్యలత, కిరణ్మయి, నర్మద, దీపిక, నితిన్‌గౌడ్, రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా సాగు పనులు

డోర్నకల్ : మండలంలోని పలు గ్రామాల్లో పత్తిసాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పత్తిపంట సాగు చేస్తున్న రైతులు దుక్కులు సిద్ధం చేసి విత్తనాలు పెడుతున్నారు. పత్తి సాగు చేస్తున్న భూముల్లో రైతులు, కూలీలతో సందడి నెలకొంది.

సెల్ టవర్ నిర్మాణ పనుల అడ్డగింత

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం తాళ్లఊకల్ గ్రామానికి చెందిన మామిళ్ల వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో ఇండస్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గురువారం గ్రామస్తులు మాట్లాడుతూ ఇప్పటికే వెంకన్న ఇంట్లో మూడు ఉద్యోగాలు ఉన్నాయని, మరొకరి వ్యవసాయ క్షేత్రంలో సెల్ టవర్ నిర్మించి ఉపాధి కల్పించాలని గ్రామస్తులు సీమ సురేష్, బత్తుల శ్రీను, మల్లయ్య, నాగేష్, తొప్పెట్ల లింగన్న, సతీష్, వెంకన్న, వీరబాబు, రమేష్‌లు దామోదర్ డిమాండ్ చేశారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

గార్ల : ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని ఎస్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల నాయకులు యాకూబ్‌పాషా, లోకేష్‌లు ఆరోపించారు. ఈమేరకు గురువారం గార్లలోని ప్రైవేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణం ఎదుట వారు నిరసన తెలిపారు. ఏజెన్సీ మండలంలో అమాయక గిరిజన విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

బాధితులకు అండగా ఉంటాం

పెద్దవంగర : బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. గురువారం మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన దుర్సోజు చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కాంగ్రెస్ నాయకులు చంద్రయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రంగు మురళి, దాసరి శ్రీనివాస్, ఎరుకల సమ్మయ్య, కోడం మోహన్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, కృష్ణారెడ్డి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కురవి : మండలంలోని తట్టుపల్లి శివారు చంద్యా తండాకు చెందిన గుగులోత్ మల్సూర్ ఇటీవల మృతి చెందాడు. గురువారం డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తండాకు వచ్చి మల్సూర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ జామా నాయక్, గుగులోత్ నెహ్రూనాయక్ తదితరులున్నారు.

పనులు వేగవంతం చేయాలి

దంతాలపల్లి : పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని బీరిశెట్టిగూడెం, వాల్యతండా, ఆగపేట పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలలో జరుగుతున్న పనులను పరిశీలించారు.

వాహనాల వేలంలో రూ.10లక్షల ఆదాయం

గూడూరు : మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వాహనాల వేలంలో రూ.10.44 లక్షల ఆదాయం వచ్చినట్లు సీఐ ఎస్.భిక్షపతి తెలిపారు. గుడుంబా, నల్లబెల్లం తయారీ, విక్రయాల సోదాలో 29 రకాల ద్విచక్ర వాహనాలు పట్టుబడ్డాయని, వాటికి జిల్లా ఉన్నతాధికారి బి.కిరణ్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

సర్టిఫికెట్లు పరిశీలించాలి

గూడూరు : మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో టీచర్‌గా పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలి సర్టిఫికెట్లు పరిశీలించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య గురువారం ప్రకటనలో తెలిపారు.

బురదరోడ్డుతో ఇబ్బందులు

డోర్నకల్ : మండలంలోని పెరుమాళ్లసంకీసలో నిర్మించిన సిమెంట్ రోడ్డు బురదమయం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక, జెడ్పీఎస్ఎస్‌కు వెళ్లే దారిలో పాఠశాలలు ప్రారంభమైన రోజే సిమెంట్ రోడ్డు నిర్మించారు. అయితే మట్టి కట్టలు ఏర్పాటు చేసి నీటిని నింపడంతో రోడ్డంతా బురదమయమైంది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వైద్యశిబిరం

నర్సింహులపేట : మండలంలోని వడ్డెర కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన ఓ వ్యక్తికి మలేరియా జ్వరం వచ్చినట్లు వైద్య పరీక్షల్లో తేలడంతో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రక్త నమూనాలను సేకరించారు. దోమల మందు స్ప్రే చేశారు. ఎంపీహెచ్ఈ యాకయ్య, ఈహెచ్ఓ బాలాజీ, హెల్త్ అసిస్టెంట్స్ సత్యనారాయణ, శ్రీనివాస్, ఏఎన్ఎంలు ప్రసన్నకుమారి, కృష్ణవేణి, అన్వేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశం ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ : మానుకోట మున్సిపల్‌లో విడుదల చేసిన నిధుల విషయంలో ప్రత్యేక జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ టి.రవీందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి.నీరజారెడ్డి, ధర్మన్న పాల్గొన్నారు.

కూలిన ఆలయ ధ్వజస్తంభం

గార్ల : మద్దిగూడెం వేట వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం గురువారం వీచిన ఈదురుగాలులకు కూలిపోయింది. ఆలయ కమిటీ చైర్మన్ బి.అమర్‌చంద్, సభ్యుడు మాలోత్ రమేష్, అర్చకుడు రామాచార్యులు సందర్శించి కూలిపోయిన ధ్వజస్తంభాన్ని పరిశీలించారు.

కీడు సోకిందని.. వనభోజనాలకు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని నడివాడ గ్రామంలో ఇటీవల వరుస మరణాలు, రహదారి ప్రమాదాలు సంభవించాయి. దీంతో గ్రామానికి కీడు సోకిందని పుకార్లు షికార్లయ్యాయి. మూఢ నమ్మకంతో గ్రామస్తులంతా సూర్యోదయానికి ముందే కుటుంబ సమేతంగా గ్రామ శివారులో వనభోజనాలకు వెళ్లారు.

అద్దెకిస్తే.. అపహరించుకెళ్లారు

దంతాలపల్లి : నమ్మి రైస్ మిల్లును అద్దెకిస్తే రూ.25 లక్షల విలువ చేసే మిషనరీ ఎత్తుకెళ్లారని మిల్లు యజమాని గుగులోత్ నాగమణి గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని తూర్పుతండాకు చెందిన నాగమణి కుటుంబ సభ్యులు ఉద్యోగరీత్యా విజయవాడలో ఉంటున్నారు. కాగా కనక దుర్గా రైస్ మిల్లు నిర్మాణం చేపట్టి కొన్ని రోజులు నిర్వహించామని, ఈ రైస్‌మిల్లును శ్రీసాయిరాఘవేంద్ర ఇండస్ట్రీ తొర్రూరు మేనేజింగ్ పార్టనర్ వనమాల నాగేశ్వరరావుకు మిషనరితో పాటు లీజుకు ఇచ్చామన్నారు. కాగా మంగళవారం మిల్లు వద్దకు కూతురుతో వెళ్లగా అందులో మిషనరి లేకపోవడంతో షాక్‌కు గురయ్యామని తెలిపారు. ఇదే విషయమై లీజుకు తీసుకున్న వనమాల నాగేశ్వరరావును ఫోన్ చేసి అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని వాపోయారు. అయితే మిషనరిని నాగేశ్వరరావు ఎత్తుకెళ్లాడని సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

నెహ్రూసెంటర్ : ఏపీ విభజన చట్టం ప్రకారం బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ సందర్భంగా నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు. ఉక్కు పరిశ్రమ కేసులో భాగంగా గురువారం కోర్టుకు హాజరయ్యారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హామీలను అమలు చేయాలని కోరితే గత ప్రభుత్వంలో అరెస్టులు, లాఠీచార్జీలు చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బి.విజయసారథిరెడ్డి, రాజు, నల్లు సుధాకర్‌రెడ్డి, కుమార్, రేషపల్లి నవీన్, రాజమౌళి, సామ పాపయ్య, వెంకన్న, శ్రీనివాస్, శేఖర్, మేక వీరన్న, తండ మాధవి పాల్గొన్నారు.

కారం మిల్లు మూసివేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న మరిపెడ వాసులు

మరిపెడ : విద్య హెర్బల్ కారం మిల్లును మూసివేయాలని డిమాండ్ చేస్తూ మరిపెడ గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విలేకరులతో మాట్లాడారు. కారం మిల్లు కారణంగా విష వాయువులు వెలువడుతున్నాయని దీంతో గ్రామస్తులు రోగాలబారిన పడుతున్నారన్నారు. అంతే కాకుండా కొన్ని సందర్భాల్లో ఊపిరి ఆడక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు మిల్లు యజమానులకు చెప్పినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో గంట్ల గోవర్ధన్ రెడ్డి, అజీజ్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌రెడ్డి, నరిసింహారెడ్డి, చంద్రశేఖర్, ఉడుగుల రాజు, వంగవీటి భరత్, శివశంకర్, అజయ్‌చారి, బాలకృష్ణ, సాధిక్, గంధం వీరన్న, నిర్మలరాజు, గందసిరి చొక్కంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ మృతి



వెంకన్న(ఫైల్)

కేసముద్రం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని సబ్‌స్టేషన్ తండా జీపీకి చెందిన మాజీ సర్పంచ్ గుగులోత్ వెంకన్న(38) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. ఈ నెల 7వ తేదీన గుగులోత్ వెంకన్న, వీరన్న కలిసి బైక్‌పై మానుకోటకు వెళ్తుండగా, పెనుగొండ క్రాస్‌రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను లారీ ఢీకొట్టింది. కాగా తీవ్రంగా గాయపడిన వెంకన్నను వరంగల్‌లోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య కల్యాణి, కూతురు, కుమారుడు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వాటర్ ప్లాంట్‌కు మరమ్మతు చేయండి

మరిపెడ రూరల్ : మండలంలోని ఉల్లెపల్లి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న జీపీ మినరల్ వాటర్ ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి శుద్ధిచేసిన తాగునీటిని అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వాటర్ ప్లాంట్ ఎదుట గ్రామస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో గ్రామంలోని ప్రత్యేక జీపీ నిధుల ద్వారా గ్రామస్తుల ఉపయోగార్థం వాటర్ ప్లాంట్‌ను నిర్మించారు. అప్పటి నుంచి సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సాఫీగా గ్రామస్తులకు కొంత కాలంగా క్యాన్ వాటర్‌కు రూ.2 రూపాయలకు, ఆ తర్వాత నుంచి రూ.5 రూపాయలకు క్యాన్ వాటర్ గ్రామస్తులకు అందిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల వాటర్ ప్లాంట్ చెడిపోయి గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పాడ్డాయి. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు బొడ్డు వెంకన్న, మహేష్‌రెడ్డి, రాము, ఉల్లోజు ఉపేందర్, రాజబాబు, బొడ్డు ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై కార్యదర్శిని వివరణ కోరగా వాటర్ ప్లాంట్ పూర్తిగా రిపేర్‌లో ఉందని, ఇందుకు రూ.40 వేలు ఖర్చు అవుతుందన్నారు.